W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

6-11-2025







## గోదావరి తీరంలో కార్తీక పౌర్ణమి శోభ..

పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా మణుగూరు మండల గోదావరి నది తీరం భక్తి వాతావరణంతో కళకళ లాడింది. మణుగూరు మండల పరిధిలోని కొండాయిగూడెం వద్ద గోదావరి నది తీరంలో భక్తుల రద్దీతో సందడి వాతావరణం నెల కొంది. బుధవారం వేకువ జామునే లేచి భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, నదీ తీరాన కార్తీక దీపాలను వెలిగించి భక్తి పారవశ్యంతో మునిగిపోయారు.

05



## ప్రయాణం ప్రాణసంకటం!

### రోడ్డుకు ఇరువైపులా నిలిచిన లారీలు

- ద్విచక్ర వాహనదారులకు తప్పని తిప్పలు..
- లారీలకు యార్డులు లేకనే సమస్య..
- పట్టించుకోని సంబంధిత అధికార యంత్రాంగం..
- ఇది మణుగూరు టూ పినపాక ప్రధాన రహదారి దుస్థితి..

03



## హెచ్చరికలు పట్టవా!

### డ్యామ్ సేఫ్టీ యాక్ట్ అమలులో వెనకడుగు

తెలంగాణ రాష్ట్రంలో జలవనరులకు, సాగు అభివృద్ధికి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒక మూలస్థంభంగా నిలుస్తోంది. అయితే, ఈ ప్రాంతంలోని 30కి పైగా ఆనకట్టలు, సాగు ప్రాజెక్టులు, రిజర్వాయర్లు ప్రస్తుతం తీవ్రమైన భద్రతా లోపాలను ఎదుర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2021లో రూపొందించిన డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం, ప్రతి రాష్ట్రం, ప్రతి ఆనకట్టకు సమగ్ర భద్రతా మూల్యాంకనం, రిస్క్ అస్సెస్మెంట్ స్టడీ, ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్ తప్పనిసరిగా సిద్ధం చేయాలి.

02



## నేటి నుంచి పత్తి కొనుగోలు

04

# విభజన గాయం!

## రాముడికి న్యాయం చేయండి


- భద్రాచలం పంచాయతీలకు న్యాయం ఎప్పుడు?
- సీఎంలు, అమిత్ షాకు తుమ్మల లేఖ
- భద్రాద్రి బంధిత గ్రామాలకు విముక్తి కల్పించాలి
- వైద్యం, విద్య కోసం రోజూ రాష్ట్రాలు దాటే గిరిజనం!
- రాష్ట్రావతరణ స్ఫూర్తిని గుర్తుచేసిన తుమ్మల

తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, ఏపీ, తెలంగాణ ముఖ్య మంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులకు కీలక లేఖ రాశారు. భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఉన్న యాటపాక, కన్నాయి గూడెం, పిచుక లపాడు, పురుషోత్తపట్నం, గుండాల అనే ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రాద్రి శ్రీ సీతారా మచంద్ర స్వామి ఆలయ పరిపాల నా సమస్యలు, గిరిజనుల దైనందిన జీవన సవాళ్లు, శాంతి భద్రతల నిర్వహణలో ఇబ్బందులను ఆయన తన లేఖలో ప్రధా నంగా ప్రస్తావించారు. ఈ డిమాండ్ కేవలం రాజకీయ అంశం కాదని, ఇది ప్రజల దశాబ్దాల ఆకాంక్ష మరియు పరిపాలనా ఆవశ్య కత అని తుమ్మల స్పష్టం చేశారు.

ఖమ్మం బ్యూరో, మహా

### శాంతిభద్రతల సమన్వయ లోపం

భద్రాచలం పరిసర మండలాలు ఎల్‌డబ్ల్యూఈ (తీవ్రవాద ప్రభావిత ప్రాంతం)గా గుర్తించబడినందున, శాంతిభద్రతల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తుమ్మల స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల పోలీస్ శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల సమర్థవంతమైన శాంతిభద్రత నిర్వహణకు ఆటంకం కలుగుతోందని, ఈ కీలక ప్రాంతం మొత్తం ఒకే రాష్ట్ర పరిపాలన కింద ఉండటం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.



08

# హెచ్చరికలు పట్టవా!

- డ్యామ్ సేఫ్టీ యాక్ట్ అమలులో వెనకడుగు
- రిస్క్‌లో 30కి పైగా ప్రాజెక్టులు
- ఖమ్మం డ్యామ్‌లకు భద్రత కరువు
- 2026 డెడ్‌లైన్ ఉన్నా నివేదిక లేదు
- ఉమ్మడి ఖమ్మంలో ఈఏపీలు శూన్యం
- విపత్తు వస్తే రక్షణ ప్రణాళిక ఏదీ?



**ఖమ్మం బ్యూరో, మహా:** తెలంగాణ రాష్ట్రంలో జలవనరులకు, సాగు అభివృద్ధికి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒక మూలస్థంభంగా నిలుస్తోంది. అయితే, ఈ ప్రాంతంలోని 30కి పైగా ఆనకట్టలు, సాగు ప్రాజెక్టులు, రిజర్వాయర్లు ప్రస్తుతం తీవ్రమైన భద్రతా లోపాలను ఎదుర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2021లో రూపొందించిన డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం, ప్రతి రాష్ట్రం, ప్రతి ఆనకట్టకు సమగ్ర భద్రతా మూల్యాంకనం, రిస్క్ అస్సెస్‌మెంట్ స్టడీ, ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్ తప్పనిసరిగా సిద్ధం చేయాలి. కానీ, 2026 డిసెంబర్ గడువు దగ్గరపడుతున్నా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్క ఆనకట్టకూ ఈ నివేదికలు పూర్తి కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రజా భద్రత, వ్యవసాయ నీటి సరఫరా, ప్రజా నిధుల వినియోగం అన్నీ ఈ నిర్లక్ష్యం కారణంగా ముప్పులో పడుతున్నాయిలి

## కార్యాచరణ శూన్యం

డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం, దేశవ్యాప్తంగా 6,500కుపైగా ఆనకట్టలు ఈ చట్ట పరిధిలోకి వచ్చాయి. వాటిలో తెలంగాణ రాష్ట్రానికి చెందినవి 173 ప్రాజెక్టులు. ప్రతి ఆనకట్టకు 2026 డిసెంబర్ నాటికి సమగ్ర భద్రతా మూల్యాంకనం పూర్తి చేయాలని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ స్పష్టంగా ఆదేశించింది. ఈ చట్టం రిస్క్ అస్సెస్‌మెంట్ స్టడీ, ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్, డిజిటల్ లాగ్‌బుక్స్‌ను తప్పనిసరి చేసింది. అయితే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఒక్క ప్రాజెక్ట్‌కూ ఈ అత్యవసర ప్రమాణాలు ఇప్పటివరకు అమలు కాలేదు.

## 30కిపైగా ప్రాజెక్టులు భద్రతా పర్యవేక్షణ లేకుండా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి, కృష్ణా ఉపనదుల మధ్య వైరా, లంకసాగర్, తాలిపేరు, కిన్నెరసాని , పాలెరు వంటి 30కి పైగా చిన్న, మధ్య, పెద్ద ఆనకట్టలు ఉన్నాయి. వీటిలో వైరా ప్రాజెక్ట్ (1953) గేట్లు పాతబడి ఉండగా, లంకసాగర్ (1956) డ్యామ్ కట్ట స్థితి నిర్లక్ష్యానికి గురైంది. తాలిపేరు ప్రాజెక్ట్ గోదావరి వరదల్లో ఒత్తిడిని ఎదుర్కొంటోంది. కిన్నెరసాని భూగర్భ లీకేజీలు గుర్తించినా, పాలెరు ప్రాజెక్ట్‌లో గేట్లలో తుప్పు పట్టినా, వాటికి సంబంధించిన సమగ్ర భద్రతా నివేదికలు లేవు. ఈ ముఖ్య ప్రాజెక్టులే కాకుండా, 1,300కు పైగా ఉన్న మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, చెరువులు కూడా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పరీక్షించబడలేదు.

## ఆర్థిక దృష్ట్యా పెద్ద ముప్పు..కోట్ల రూపాయల నష్టం

ప్రతి ప్రాజెక్ట్ నిర్మాణం, మరమ్మత్తు, సంరక్షణకు కోట్ల రూపాయల ప్రజా నిధులు ఖర్చవుతున్నాయి. సమగ్ర సాంకేతిక మూల్యాంకనం లేకపోవడం వలన అవే లోపాలకు మరలా మరలా నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఉదాహరణకు, వైరా ప్రాజెక్ట్‌లో గత పదేళ్లలో ?18 కోట్లకు పైగా, లంకసాగర్‌లో ?12 కోట్లు మరమ్మత్తులకే ఖర్చయ్యాయి. అయినా సమస్యలు పునరావృతమవుతున్నాయి. నిపుణుల ప్రకారం, ఒక్క సీడీఎస్‌ఈ సిద్ధం చేయకపోవడం వలన రాష్ట్రానికి సగటున సంవత్సరానికి ?100 కోట్ల ఆర్థిక నష్టం ఏర్పడే అవకాశం ఉంది.

### చట్టపరమైన పరిణామాలు తప్పవు

డ్యామ్ సేఫ్టీ యాక్ట్ అమలులో జరుగుతున్న జాప్యంపై కేంద్రం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. కేంద్ర జల్‌శక్తి మంత్రి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసి, 2026 డిసెంబర్ నాటికి సీడీఎస్‌ఈలు పూర్తి చేయాలని, లేకపోతే రాష్ట్రం చట్టపరమైన బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్ట్‌కూ పూర్తి సీడీఎస్‌ఈ సిద్ధం కాలేదని కేంద్రం పేర్కొంది. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ కూడా చురుగ్గా పనిచేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆనకట్టలు ప్రజలకు జీవనాధారం. కానీ భద్రతా చర్యలు లేకపోవడం వలన అవే ప్రమాదాలుగా మారే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రజా నిధులు, రైతు జీవనోపాధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ.. ఇవన్నీ ప్రభుత్వ సమయోచిత చర్యలపైనే ఆధారపడి ఉన్నాయి. భవిష్యత్తులో ఏ విపత్తూ సంభవించకూడదంటే, ప్రభుత్వం తక్షణమే సీడీఎస్‌ఈ, రిస్క్ అస్సెస్‌మెంట్, ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్‌లు సిద్ధం చేయడం అత్యవసరం.

## ప్రజల ప్రాణాలకే ముప్పు

ప్రమాద సమయాల్లో ఏ గ్రామాలు ప్రభావితమవుతాయి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, ఏ అధికారికి బాధ్యత ఉంటుందనేది సూచించే ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్ , ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్క ప్రాజెక్ట్‌కూ లేదు. వైరా, లంకసాగర్, తాలిపేరు కింద ఉన్న వందల గ్రామాలు వరద ముప్పులో ఉన్నా, ప్రమాదం జరిగితే ఎవరికి సమాచారం ఇవ్వాలి అనే మార్గదర్శకాలు ఎక్కడా లేవు. ఒకే ఆనకట్ట విఫలమైతే 10 నుంచి 15 మండలాల వరకు వరద ప్రభావం ఉండే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యం

**అశ్వారావుపేట/హైదరాబాద్ మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ విజయం సాధించేందుకు అశ్వారావుపేట కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచారం అశ్వారావుపేట శాసన సభ్యుడు జారే ఆదినారాయణ సారథ్యంలో, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జూపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా సాగుతోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్ ప్రాంతంలో ఇంటింటికీ ప్రచారం చేస్తూ ప్రజల మద్దతు పొందుతున్నారు. నవీన్ కుమార్ యాదవ్ గెలుపు ఖాయమనే నమ్మకంతో స్థానికుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రచార కార్యక్రమంలో తుమ్మ రాంబాబు, బండి చెన్నారెడ్డి, మిండా హరిబాబు, ఆకుల శ్రీను, నార్లపాటి దివాకర్, కరీం నాగు, నాగ కిషోర్, రహమత్ తదితర అశ్వారావుపేట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# మాజీ మంత్రి హరీష్ రావు తండ్రికి అశ్వారావుపేట బిఆర్ఎస్ నాయకుల నివాళి



**అశ్వారావుపేట/హైదరాబాద్, మహా:** మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మరణం పట్ల అశ్వారావుపేట బిఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు. హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అశ్వారావుపేట బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, సంపూర్ణ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మోహన్ ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# చంటి ముదిరాజ్‌కి సేవా రత్న అవార్డు



**కొత్తగూడెం రూరల్, మహా:** సమాచార హక్కు చట్టం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ కి ఢిల్లీ నుండి ప్రతిష్టాత్మక "సేవా రత్న అవార్డు 2025"లభించడం గర్వకారణంగా ఉందని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక సేవారంగంలో విశేష సేవలందించి ప్రజా హక్కుల సాధనలో నిరంతరం పోరాటం చేస్తూ సేవాస్ఫూర్తితో ముందుకు సాగుతూ సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచి ఈ యొక్క అవార్డుకు ఎంపిక కావడం ప్రతి తెలంగాణ వాడికి గర్వకారణమని సంజీవ రాజు పేరుకొంటూ అభినందించారు.

# డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ కొరకు క్యాంప్‌ల నిర్వహణ



**కొత్తగూడెం రూరల్, మహా:** కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0లో దేశవ్యాప్తంగా అన్ని సంస్థల పెన్షనర్స్ లో "డిజిటల్ సాధికారత" పెంచాలనే ఉద్దేశంతో పెన్షనర్స్ అందరూ తమ అండ్రాయిడ్ మొబైల్ నుండే మొబైల్ అప్లికేషన్ ద్వారా సిఎంపిఎఫ్ సిపిఆర్ఎంఎస్ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించేందుకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక క్యాంపులను నిర్వహించవలసినదిగా ఆదేశించారు. దీనికి అనుగుణంగా సింగరేణి సంస్థ సిఎంపిఎఫ్ఓ సంస్థల ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్ లను నిర్వహించబోతున్నామని సింగరేణి జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సిఎంపిఎఫ్ఓ పెన్షన్ పొందే సిపిఆర్ఎంఎస్ కార్డులు గల సింగరేణి మాజీ ఉద్యోగుల కొరకు గురువారం ఉదయం 10.30 గంటలకు కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయ హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ నందు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్ ను నిర్వహిస్తామని పెన్షనర్లు సిపిఆర్ఎంఎస్ కార్డుదారులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్ లకు విచ్చేసే సిఎంపిఎఫ్ఓ పెన్షనర్లు సిపిఆర్ఎంఎస్ కార్డుదారులు ఉదయం 10.30 గంటల లోగా ధృవ పత్రాలను తమ వెంట తీసుకురావాలని తెలిపారు. భార్య భర్తల ఇరువురి ఆధార్ కార్డు జిరాక్స్, సిఎంపిఎఫ్ఓ పెన్షనర్లు సిపిఆర్ఎంఎస్ కార్డుదారుల మొబైల్ ఫోన్(ఓటిపి కొరకు),పెన్షన్ పేమెంట్ ఆర్డర్ సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డ్ జిరాక్స్ లు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్ తమ తెచ్చుకోవాలి చెప్పారు.

# ఈ రహదారిపై ప్రయాణం ప్రాణసంకటం!



- ట్రాఫిక్ జామ్‌తో స్తంభించిన రాకపోకలు
- రోడ్డుకు ఇరువైపులా నిలిచిన లారీలు..
- ద్విచక్ర వాహనదారులకు తప్పని తిప్పలు..
- లారీలకు యార్డులు లేకనే సమస్య..
- పట్టించుకోని సంబంధిత అధికార యంత్రాంగం..
- ఇది మణుగూరు టూ పినపాక ప్రధాన రహదారి దుస్థితి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** మణుగూరు మండలం నుంచి పినపాక వరకు ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ప్రధాన రహదారిపై వందల సంఖ్యలో లారీలు నిలిచిపోవడంతో మంగళవారం ట్రాఫిక్ జామ్ తీవ్రంగా నెలకొంది. ద్విచక్ర వాహనదారులు కూడా ముందుకు కదలలేని స్థితి ఏర్పడింది. రహదారిపై గుంతలు, దెబ్బతిన్న ప్యాచ్‌లు, లారీల అతివేగం, నిర్లక్ష్య ధోరణి కలసి ఈ మార్గాన్ని ప్రమాదాల మయం చేస్తున్నాయి.

### ప్రత్యేక యార్డులు లేకనే సమస్య..

మణుగూరు సిఎస్పి కాటా నుంచి పినపాక క్రాస్ రోడ్ వరకు నిత్యం వందల సంఖ్యలో ఇసుక లారీలు, బిటిపిఎస్ యాష్ ట్యాంకర్లు, బొగ్గు టిప్పర్లతో పాటు ఇతర వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా డిటిపిఎస్ యాష్ కోసం వచ్చే ట్యాంకర్లను నిలిపి ఉంచేందుకు ప్రత్యేక యార్డు లేకపోవడంతో సాంబాయిగూడెం నుంచి మొదలు బిటిపిఎస్ వరకు ప్రధాన రహదారిపైనే నిలిపివేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలోని వివిధ పట్టణాల నుంచి ఇసుక కోసం వచ్చిన ఇసుక లారీలకు ఇసుక ర్యాంపు నిర్వాహకులు ప్రత్యేక యార్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఇసుక లారీలు సైతం ప్రధాన రహదారిపైనే నిలిపివేస్తున్నారు. లోడింగ్ కోసం వచ్చే లారీలతో పాటు ఇసుకలోడు చేసుకొని వెళ్లే లారీలు కూడా ప్రధాన రహదారినే యార్డుగా వినియోగించడం సమస్యకు ప్రధాన కారణంగా మారుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే గత రాత్రి మొదలు మంగళవారం మధ్యాహ్నం వరకు తీవ్ర ట్రాఫిక్ జాం నెలకొంది. తిర్లాపురం, రామానుజవరం, సాంబయ్యగూడెం, ధమ్మక్కపేట, పినపాక క్రాస్ రోడ్ వరకూ రహదారికి ఇరువైపులా లారీలు క్యూలు కట్టి నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అయి సమస్య తీవ్రమైంది. మంగళవారం రాత్రి ప్రత్యేక పోలీస్ సిబ్బంది సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.

### ఆందోళన కలిగిస్తున్న అతివేగం..

ఈ రహదారిపై ఇసుక లారీలు, బొగ్గు టిప్పర్ల అతివేగం ఆందోళనకు గురిచేస్తుంది. దీంతో రహదారి వెంట గ్రామాల ప్రజలు 24 గంటలు ప్రాణాలను పణంగా పెట్టి రహదారి దాటాల్సిన పరిస్థితి నెలకొందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు టిప్పర్లు, ఇసుక లారీల వేగం, నిర్లక్ష్య ధోరణి నియంత్రణకు సంబంధిత అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీలతో పాటే బీటీపీఎస్ యాష్ ట్యాంకర్ల దుస్థితి అదేనని ప్రజలు వాపోతున్నారు. బిటీపీఎస్ యాష్ ట్యాంకర్లు కూడా నిర్లక్ష్య రీతిలో రహదారులపై దూసుకెల్లడం, యాష్ టాంకర్లకు ప్రత్యేక పార్కింగ్ యార్డులు లేకపోవడం కూడా ట్రాఫిక్ సమస్యలకు మూలకారణమని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జరుగుతున్న ప్రమాదాలకు, ట్రాఫిక్ సమస్యలకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గంలో ఇప్పటికే పలు ప్రమాదాలు సంభవించగా, పలువురు మృతి చెందారు. కొందరు శాశ్వత వికలాంగులుగా మారిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా అధికారులు మాత్రం మూగవహిస్తున్నారని, కనీసం రహదారిపై గుంతలు సరిచేయాలన్న ఆలోచన కూడా చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

### సింగరేణి, బీటీపీఎస్ సిఎస్ఆర్ నిధులు ఎక్కడ..?

సింగరేణి, బీటీపీఎస్ వంటి పెద్ద సంస్థలు ఇక్కడి ప్రజల జీవనోపాధి మీద ఆధారపడినా, ఈ ప్రాంత ప్రధాన రహదారి అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు ఖర్చు పెట్టింది శూన్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రతిపాదనలతో కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శిస్తున్నారు.

### సమస్యను పరిష్కరించాలని ప్రజల డిమాండ్

మణుగూరు నుంచి పినపాక క్రాస్ రోడ్ వరకు గల ప్రధాన రహదారిపై నిత్యం నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత సంస్థలను, పోలీసు యంత్రాంగాన్ని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లారీల వేగం, నిర్లక్ష్యాన్ని నియంత్రించి, రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

# భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- అధిక సంఖ్యలో దైవ దీపారాధనలో పాల్గొన్న మహిళలు

**జూలూరుపాడు, మహా:** మండల వ్యాప్తంగా కార్తిక పౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతోటి వైభవంగా బుధవారం జరుపుకున్నారు. మండల పరిధి పాపకొల్లు, కాకర్ల గ్రామాలలోని కాకతీయుల కాలంనాటి చారిత్రక శ్రీ ఉమా సోమలింగేశ్వర స్వామి, శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఏకువజామునే ఆలయాల వద్దకు చేరుకొని దైవ దీపారాధన చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి దైవానికి నైవేద్యం సమర్పించి ఆలయ అర్చకుల ఆశీస్సులు పొందారు. అదేవిధంగా కార్తిక పౌర్ణమి సందర్భంగా నర్సాపురం, కాకర్ల తదితర ప్రాంతాలలో నాగదేవతకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. కాకర్ల గ్రామానికి చెందిన భక్తులు ప్రభ బండ్లతో ఊరేగింపుగా తరలివచ్చి వేణుగోపాల స్వామికి మొక్కులు చెల్లించిన సన్నివేశం చూపరులను ఆకట్టుకుంది. కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా భక్తుల భగవత్ నామస్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి.







# నేటి నుంచి పత్తి కొనుగోలు బంద్!



**ఖమ్మం బ్యూరో, మహా:** పత్తి రైతుల ఆవేదన మరోసారి తీవ్రస్థాయికి చేరింది. ప్రభుత్వం అనుసరిస్తున్న పత్తి కొనుగోలు విధానాలు, అలాగే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అవలంబిస్తున్న అసమతుల్య కేటాయింపులపై తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నెల 6వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేస్తామని వ్యాపారులు స్పష్టంగా ప్రకటించడంతో, మార్కెట్‌లో పత్తి అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్న రైతులు గందరగోళంలో పడ్డారు. ఇది కేవలం వ్యాపారుల సమస్య కాదని, రాష్ట్ర వ్యవసాయ రంగానికే పెను సవాల్‌గా మారింది. పత్తి వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేసేందుకు ప్రధాన కారణం, ప్రభుత్వ , సీసీఐ సంస్థల నిర్లక్ష్య ధోరణే అని అసోసియేషన్ స్పష్టం చేసింది. గత నెల 30న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ రాసినా, సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కొనుగోళ్లు కొనసాగించడం అసాధ్యం అని స్పష్టం ఐనది. సీసీఐ 322 జిన్నింగ్ మిల్లులకు టెండర్ ఫైనలైజ్ చేసినా, ఎల్-1, ఎల్-2, ఎల్-3 క్యాటగిరీల విభజన, కేటాయింపుల్లో అసమతుల్యత కారణంగా చాలా మిల్లులు మూతపడే పరిస్థితి ఏర్పడింది.

## కపాస్ కిసాన్ యాప్'తో రైతుల కష్టాలు

కొనుగోళ్లు నిలిచిపోవడానికి, రైతులలో అసహనానికి 'కపాస్ కిసాన్ యాప్' ద్వారా ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానం ప్రధాన కారణంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది రైతులకు స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం లేదా యాప్ వాడకంపై అవగాహన లేకపోవడంతో, స్లాట్ బుకింగ్ లేకుండా పత్తి తీసుకొచ్చిన వారి నుండి కొనుగోలు చేయలేమని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు, ఇటీవల వర్షాల కారణంగా పత్తిలో తేమ శాతం అధికంగా ఉండటంతో, మిల్లులు పత్తిని తిరస్కరిస్తున్నాయి. దీంతో పండించిన పంటను అమ్ముకోలేక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "స్మార్ట్‌ఫోన్ లేక రైతు రైతు కాదు అన్నట్టుంది. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోలేకపోతే పంట వృథా అవుతుందా?" అని ఒక రైతు ప్రశ్నించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

## ఉమ్మడి ఖమ్మంపై 480 కోట్ల ఆర్థిక ప్రభావం

ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ప్రతి సంవత్సరం సుమారు 1.95 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుంది. ఈ ఏడాది వర్షాల ప్రభావంతో సగటు ఉత్పత్తి ఎకరానికి 7.5 క్వింటాళ్ల నుండి 6.2 క్వింటాళ్లకు పడిపోయింది. మొత్తం పత్తి ఉత్పత్తి సుమారు 12.1 లక్షల క్వింటాళు ్గా అంచనా. క్వింటాలుకు ?7,020 మద్దతు ధర ఉన్నప్పటికీ, తేమ సమస్యల వల్ల మార్కెట్‌లో ధరలు ?5,500కు పడిపోవడంతో రైతులు పెట్టుబడి నష్టాల్లోకి వెళ్లారు. రోజుకు సగటున ?100 కోట్ల పత్తి లావాదేవీలు జరిగే రాష్ట్రంలో, ఈ బంద్ వల్ల మొదటి వారం నుంచే సుమారు ?700 కోట్ల వ్యాపార నష్టం కలుగుతుంది. ఒక్క ఖమ్మం జిల్లాలోనే రోజుకు ?8 నుండి ?10 కోట్ల లావాదేవీలు ఆగిపోతాయి. ఈ సంక్షోభం కొనసాగితే, జిల్లా పత్తి రైతులపై ?480 కోట్ల వరకు ఆర్థిక ప్రభావం పడే అవకాశం ఉంది.

## వ్యాపారుల డిమాండ్లు

తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి ఐదు ప్రధాన డిమాండ్లను ఉంచింది. వీటిలో సీసీఐ అసమతుల్య అలాట్‌మెంట్ విధానాన్ని రద్దు చేయడం, 'కపాస్ కిసాన్ యాప్'ను తాత్కాలికంగా నిలిపివేయడం, వర్షపాతం ఆధారంగా తేమ శాతం ప్రమాణాల తో పాటుగా అదనంగా, మిల్లుల ఎల్-1, ఎల్-2 కేటాయింపులను పారదర్శకంగా అమలు చేయాలని, అలాగే మార్కెట్ యార్డుల్లో తాత్కాలిక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ సమస్యకు పరిష్కారం లభించాలంటే ప్రభుత్వం సీసీఐ, వ్యాపారులు, రైతులు మధ్య త్రైపాక్షిక చర్చ తక్షణ అవసరం. డిజిటల్ స్లాట్ బుకింగ్‌ను గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయక కేంద్రాల ద్వారా సులభతరం చేయాలి.

### రాజకీయ ప్రభావం

ఖమ్మం జిల్లాలో సుమారు 9.6 లక్షల ఓటర్లలో రైతు వర్గం 42 శాతం ఉండడంతో, ఈ ఆర్థిక సంక్షోభం రాజకీయంగా కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. జిన్నింగ్ మిల్లులు మూతపడితే, సుమారు 17,000 కూలీలు ఉద్యోగాలు కోల్పోతారు. వ్యాపారుల బంద్ దీర్ఘకాలం కొనసాగితే, మార్కెట్ ధరలు మరింత క్షీణించి, తదుపరి సీజన్‌లో పత్తి సాగు విస్తీర్ణం కనీసం 25 శాతం తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పత్తి తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుంది కాబట్టి, ప్రభుత్వం సమయానికి స్పందించి వ్యాపారుల, రైతుల మధ్య నడుస్తున్న ఈ విభేదాలకు ముగింపు పలకకపోతే, రాబోయే నెలల్లో రైతు ఉద్యమాలు చేసే అవకాశం ఉన్నది.

# ప్రాణాల కోసం పోరాడుతున్న ఆటో డ్రైవర్

- లక్ష్మణరావు పరిస్థితి ఆందోళనకరం
- వైద్య ఖర్చులకు పేదరికం అడ్డు..
- చికిత్సకు డబ్బుల్లేక సతమతమవుతున్న కుటుంబం..
- దాతలు ముందుకు రావాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి



**మణుగూరు/పినపాక, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దోమల లక్ష్మణరావు ప్రాణాలతో పోరాడుతున్నాడు. కడుపు సంబంధిత తీవ్రమైన వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఖమ్మంలోని శ్రీ సాయి హాస్పిటల్ లో చేరాడు. వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. రోజువారీ ఆటో నడిపి కుటుంబాన్ని పోషిస్తున్న లక్ష్మణరావు పేదరికంలో చిక్కుకొని, వైద్య చికిత్స ఖర్చులకు డబ్బులు సమకూర్చుకోలేక తీవ్ర ఆందోళనలో ఉన్నాడు. భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు కన్నీటి పర్యంతమవుతున్నారు.నా భర్త ప్రాణం నిలబెట్టాలంటే మీ సహాయం కావాలని లక్ష్మణరావు భార్య వేదన వ్యక్తం చేశారు. వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న ఈ కుటుంబానికి దయగల మనసులు, దాతలు తోచినంత ఆర్థిక సహాయం చేయాలని స్థానికులు, బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం అందించదలచిన వారు ఫోన్ పే నంబర్ 7013723777 కు నేరుగా డబ్బులు పంపించాలని లక్ష్మణరావు సతీమణి కోరుతున్నారు. ప్రాణాల కోసం పోరాడుతున్న ఈ పేద ఆటో డ్రైవర్‌కు మనసున్న మానవులు చేయూతనిస్తే ఒక కుటుంబం తిరిగి వెలుగులోకి వస్తుందని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

# సింగరేణి నూతన జిఎంతో సత్తుపల్లి ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం



**సత్తుపల్లి, మహా:** నూతనంగా ఏర్పాటైన సత్తుపల్లి సింగరేణి ఏరియాకు జనరల్ మేనేజర్ గా నియమితులైన చింతల.శ్రీనివాస్ తో సత్తుపల్లి నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. దీనిలో భాగంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మాట్లా డుతూ సింగరేణి కార్యాలయ వార్తలు ఎలక్ట్రానిక్ మీడియాకు అందించడంలో సింగరేణి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసే కార్యక్రమాలకు మీడియాను స్వాగతించాలని కోరారు. ఈ సందర్భంగా జి.ఎం చింతల.శ్రీనివాస్ స్పందిస్తూ సంస్థ బహిర్గత సమావేశాలకు మీడియాను స్వాగతిస్తామని, రానున్న రోజుల్లో మీడియా ప్రతినిధులతో సత్సంబంధం కలిగి వ్యవహరిస్తామని, ఈ దిశగా సింగరేణి కార్మికులకు, మీడియా ప్రతినిధులకు సత్తుపల్లి వేదికగా క్రికెట్ క్రీడ నిర్వహించే ఆలోచన ఉన్నట్లు జీ.ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.జీ.ఎం నరసింహారావు, ఎస్.ఓ.టు.జి.ఎం,ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

# క్షుద్రపూజల కలకలం

**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం, మొద్దులగూడెం, అచ్యుతాపురం మూడు రోడ్ల కూడలిలో బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసినట్టు గుర్తించి స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. రోడ్డు మధ్యలో నిమ్మకాయలు, కొబ్బరికాయలు, ఎర్రచందనం, రక్తపు మరకలు వంటి వస్తువులు కనిపించడంతో గ్రామస్తులు ఆ ప్రదేశం అటుగా వెళ్లటానికి కూడా వెనుకంజ వేస్తున్నారు. ఇక కొంతమంది ఈ రోజుల్లో ఇలాంటి వాటికి భయపడేది లేదు, అజ్ఞానానికి తావు ఇవ్వకూడదు అని కొట్టిపడేస్తుండగా, మరికొందరు మాత్రం ఏం జరిగిందో ఎవరికీ తెలియదు కానీ జాగ్రత్తగా ఉండడమే మంచిది అని అంటున్నారు. ఈ ఘటనపై స్థానికుల్లో ఆసక్తి, భయం కలగలిపిన చర్చ నడుస్తోంది.



మహా పత్రిక



## కోడి పందాలు ఆడుతున్న వ్యక్తులు అరెస్ట్

**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలం బోడు పోలీసులు నమ్మదగిన సమాచారంతో మోట్లగూడెం ఫారెస్ట్ ఏరియాలో కోడిపందాలు ఆడుతున్న వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నరు బోడు ఎస్సై శ్రీనివాసరెడ్డి సిబ్బంది పోలీసువారిని చూసి అక్కడ ఉన్న మొత్తం 6 గురు లో ముగ్గురు పారిపోవడం జరిగిందని. మిగిలిన ముగ్గురిని పట్టుకొని వారిని విచారించి వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు, 2500 రూపాయలు, రెండు బైకులు ,2 నాటు కోళ్లు ను స్వాధీనపరచుకోవడం జరిగిందని తెలిపారు . ఈ ఆరుగురు పై కేసు నమోదు వారి వివరాలు: నిట్ట రమేష్ ఆళ్లపల్లి, ఎస్ కే సోయల్ ఆళ్లపల్లి, కుంటాప్రకాష్ ఆళ్లపల్లి,పెండకట్ల ఆనందరావు, ఆళ్లపల్లి కోలగాని కృష్ణ మోట్లగూడెం, తాటి జగదీష్, మద్రాస్ తండా వీరిని అరెస్టు చేసినట్లు బోడు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## నీలాద్రి ఆలయానికి గుడిగంట అందించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ బాలాజీ



**తల్లాడ, మహా :** సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలంలో ఉన్న నీలాద్రిశ్వర స్వామి ఆలయానికి ఖమ్మం ట్రాఫిక్ కానిస్టేబుల్, సుదీర్ఘకాలం తల్లాడలో విధులు నిర్వహించిన బానోతు బాలాజీ గుడిగంట బహూకరించారు. ఈ మేరకు బుధవారం ఆలయ నిర్వాహకులకు గంటను అందించారు. సుమారు నాలుగు న్నర కేజీలు బరువు గల గంటను ఆయన అందించారు. ఆలయ కమిటీ ఈవో, ఆలయ చైర్మన్ నరసింహారావు సమక్షంలో ఆయన గుడిగంటను గుడికి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలాజీని ఆలయ చైర్మన్ నరసింహారావు, తల్లాడ మండల నీలాద్రి ఆలయ డైరెక్టర్ దగ్గుల నాగిరెడ్డి అభినందించారు. ఆలయానికి సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా మానవ జన్మకు సార్థకత ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని గంటను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## అమరవీరుల వర్ధంతి సభలను జయప్రదం చేయండి



**టేకులపల్లి మహా:** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల వర్ధంతి సభలను పిలుపులో భాగంగా టేకులపల్లి మండల కార్యదర్శి చేప కృష్ణ అధ్యక్షా కాంచనపల్లి వీరులకు స్థూపం వద్ద నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మీసాల రాములు మోకాళ్ళ ప్రసాద్ చర్ప వెంకటేష్, తునికి పార్టీ ప్రభాకర్ చర్ప పేత్రు వట్టం సీతారాములు చెర్ప నారాయణ కుంపటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లిలో కార్తీక పౌర్ణమి



**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగిస్తున్న భక్తులు

# గోదావరి తీరంలో కార్తీక పౌర్ణమి శోభ

## భక్తుల తాకిడితో శివాలయాల్లో సందడి..

## శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు..







**మణుగూరు, మహా:** పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా మణుగూరు మండల గోదావరి నది తీరం భక్తి వాతావరణంతో కళకళలాడింది. మణుగూరు మండల పరిధిలోని కొండాయిగూడెం వద్ద గోదావరి నది తీరంలో భక్తుల రద్దీతో సందడి వాతావరణం నెలకొంది. బుధవారం వేకువజామునే లేచి భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, నదీ తీరాన కార్తీక దీపాలను వెలిగించి భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. ఈ సందర్భంగా కొండాయిగూడెం శివాలయం, మణుగూరు శ్రీ నీలకంఠేశ్వరాలయం, అశోక్‌నగర్, పివి కాలనీ, గుట్టమల్లారం శివాలయాలు భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. ఆలయ కమిటీలు, గ్రామపంచాయతీలు, పోలీసులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాలు పూలతో, దీపాలతో నిండిపోగా.. భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి. ఆయా ఆలయాల్లో శివలింగాలకు కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు దీపార్చనలు, శివలింగానికి పాలాభిషేకాలు నిర్వహించారు. శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో వేలాది మంది భక్తులు హాజరై, శివలింగాన్ని దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగించారు. గోదావరి నది తీరం, శివాలయాలు కార్తీక దీపకాంతులతో మెరిసిపోవడంతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. భక్తుల రాకపోకలకు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి సిఐ నాగబాబుల ఆదేశాలతో ఎస్సై నగేష్, పోలీసు సిబ్బంది, సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## కుక్క అడ్డు రావడంతో కారు బోల్తా

**కూసుమంచి,మహా:** సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కుక్క అడ్డు రావడంతో కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో మహిళ మృతి చెందగా, ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అనెపర్తి రాణి (38), ఆమె భర్త అనెపర్తి సాయి, పిల్లలు జహ్నవి మరియు లోకేశ్ హైదరాబాదు నుంచి తమ సొంతూరికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మామిళ్లగూడెం సమీపానికి చేరుకునే సరికి రహదారిపై ఒక్కసారిగా కుక్క పరుగెత్తి రావడంతో డ్రైవర్ బ్రేక్ వేయగా కారు అదుపుతప్పి బోల్తా కొట్టి పక్కకు పడిపోయింది. తీవ్రంగా గాయపడిన రాణిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యంలోనే ఆమె మృతిచెందింది. గాయపడిన జహ్నవి, లోకేశ్‌లను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై భర్త సాయిరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోతె పోలీస్‌స్టేషన్ ఎస్సై అజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రగతిశీల విద్యార్థి ఆశయ సాధనకై పోరాడుదాం




**టేకులపల్లి - మహా:** నవంబర్ ఐదు నుండి 11 వరకు విద్యార్థి అమరవీరుల సంస్కరణ సభలు నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి ఎస్ యు) రాష్ట్ర కార్యవర్గం పిలుపులో భాగంగా ప్రగతిశీల విద్యార్థి సంఘం తోడ్పాటు అందించిన మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్య ప్రగతి విద్యార్థి ఉద్యమ నిర్మాత జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ పొందిన ఇల్లందు మండలం బొజ్జయిగూడెం గ్రామ శివారు ప్రస్తుతం కొత్తగూడెం ఇల్లందు ప్రధాన రహదారి ఈ సందర్భంగా వారికి విప్లవ జోహార్లు అర్పిస్తున్న పీడీఎస్యు జిల్లా అధ్యక్షుడు బి విజయ్ జిల్లా కార్యదర్శి జే గణేష్ చిత్రపటానికి పూలమాల వేసిన కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నాయకులు బి చందు సాయికుమార్ అరుణ్ సంతోష్ గణేష్ చరణ్ తదితరులు పాల్గొన్నారు

## మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయండి

### మార్కెట్ను సందర్శించిన సిపిఐ బృందం

**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. బుధవారం సిపిఐ – నాయకులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలు జరిగే సమయం కాబట్టి వీలైనంత తొందరగా నాణ్యతతో పనులను పూర్తి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ పెద్ద వ్యవసాయ మార్కెట్గా ఖమ్మం ఉందని తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, నల్లగొండతో పాటు ఆంధ్రా నుంచి కూడా వచ్చి ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులను రైతులు విక్రయిస్తారని ఆయన తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ మార్కెట్ పనులను పూర్తి చేయాలని జానిమియా కోరారు. మిర్చి సీజన్ త్వరలో ప్రారంభం కానుందని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేవిధంగా ఉందని పత్తి కొనుగోలుపై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ –సలాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా సమితి సభ్యులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, నాయకులు భూక్యా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

- తేమ శాతం పేరుతో కోతలు విధించొద్దు
- కేంద్ర ప్రభుత్వం విదేశీ పత్తి దిగుమతి చేయడం వలన ఈ దేశ రైతులకు నష్టం
- పండిన మొత్తం పంటను మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలి
- నిరుద్యోగులు చేస్తున్న పోరాటానికి సిపిఎం మద్దతు
- నలబై రెండు శాతం బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుంది
- విలేఖరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ




**కొత్తగూడెం రూరల్, మహా:** పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా తేమ శాతం పేరుతో కోతలు విధించొద్దు అని పండిన మొత్తం పంటను మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం మంచికంటి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తేమ శాతం పేరుతో పత్తి కొనుగోలు చేయకుండా ఆంక్షలు పెడుతున్నారని కొనుగోలు యాప్ ద్వారానే రైతులు పత్తి కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పడం వలన పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఏడు క్వింటాల పత్తి మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్తుంటే ఎక్కువగా పండించిన పంటను ఏమి చేయాలో వారే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అకాల వర్షం వస్తే పంట తడవకుండా రైతులు ఎలా కాపాడుకుంటారని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాల వలన పత్తి తడిసి తేమ పెరిగిందని అందుకని తేమతో సంబంధం లేకుండా మొత్తం పంటను మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల నుండి పత్తి కొనుగోలు చేయకుండా విదేశాల నుండి మాత్రం సుంకాలు ఎత్తివేసి దిగుమతి చేసుకుంటుందని దీనివలన రైతాంగం నష్టపోతున్నారని దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం వలన నేడు నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారని ఆ పోరాటానికి సిపిఎం మద్దతు ఇస్తోందని అన్నారు. ప్రభుత్వం జాబ్ కాలెండర్ ప్రకటించి చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సమ్మెలో ఉన్నాయని దీనివలన విద్యార్థులు నష్టపోతున్నారని ప్రభుత్వం వారితో చర్చలు జరిపి మొదట హామీ ఇచ్చిన పన్నెండు వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె విరమించే విధంగా ప్రభుత్వం చర్చలు జరపాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ అడ్డుపడుతుందని బీసీ రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపి కేంద్రానికి పంపితే లేనిపోని కారణాలు చెప్పి కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని అన్నారు.

## రైతులను కాపాడే పంటల బీమా కావాలి..

రైతులు చనిపోయాక వచ్చే బీమా కంటే రైతులను కాపాడే పంటల బీమా కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన పంటకు రక్షణ కల్పించడంలో సరైనా సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మార్కెట్ కి వచ్చిన పంటకు రక్షణ లేకపోతే రైతులు చేనులో ఇంట్లో పెట్టుకోలేదని ఇలాంటి పరిస్థితుల్లో ఆ పంటకు కొనుగోలు కేంద్రాల వద్ద రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. రైతు చనిపోయాక వచ్చే రైతు బీమా కంటే రైతులను కాపాడే పంటల బీమా ఇస్తే రైతులు ప్రాణాలు నిలబడతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ బృందం రాష్ట్రంలో నష్ట పోయిన పంటను సర్వే చేసి పంట నష్ట పోయిన రైతులకు ఎకరానికి యాభై వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రహదారులకు మరమ్మత్తులు చేయాలి..

జిల్లాలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రహదారులు మరమ్మతులు చేసాకనే ఇసుక లారీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. జిల్లాలో మొక్కజొన్న పత్తి వరి రైతులు అకాల వర్షం వలన తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పంటల బోనస్ పద్దెనిమిది కోట్ల అరవై ఐదు లక్షల రూపాయలు పెండింగ్లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలని, ఈ సంవత్సరం బోనస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ లిక్కి బాలరాజులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యే పాయం జోష్



**మణుగూరు, మహా :** జూబ్లీహిల్స్ నియోజక వర్గం లో జరుగుతున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున రంగంలోకి దిగాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు బుధవారం జూబ్లీహిల్స్‌లో పాదయాత్రలో పాల్గొ ని ఓటర్లను ఆకర్షించారు. ప్రచార సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవితాలను అభివృద్ధి దిశగా మార్చేస్తున్నాయని, జూబ్లీహిల్స్ వంటి నగర ప్రాంతాలు కూడా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు.

# న్యాయం కోసం నిరీక్షణ..!

- దారుణానికి గురైన చిన్నారి
- అఘాయిత్యం చేసిన గంజాయి యువత
- 5 రోజులు దాటినా దొరకని నిందితులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాలు

**ఖమ్మం - మహా:** ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలంలో మానవత్వానికే మాయని మచ్చ తెచ్చిన ఒక అత్యంత పాశవిక ఘటన రాష్ట్రంలో కలకలం సృష్టించింది. ప్రార్థనా మందిరం నుంచి ఏడుస్తూ ఒంటరిగా ఇంటికెళ్తున్న ఒక మైనర్ బాలికపై, గంజాయి మత్తులో ఉన్నట్లు భావిస్తున్న ముగ్గురు కిరాతకులు అఘాయిత్యానికి పాల్పడటం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అమాయక బాలికను మోసపూరితంగా తీసుకెళ్లి, అత్యంత దారుణంగా ఆమె చేతులు వెనక్కి విరిచి లైంగిక దాడి చేసిన ఈ అమానుష చర్యపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నా, నిందితులు (ఇద్దరు మైనర్లు, ఒక 18 ఏళ్ల యువకుడు) ఇంకా పరారీలోనే ఉండటం పోలీసుల దర్యాప్తు తీరుపై తీవ్ర అనుమానాలు, ప్రజా ఆగ్రహాన్ని పెంచుతున్నాయి. బాలికకు న్యాయం జరగాలని, నిందితులను తక్షణమే పట్టుకొని పోక్సో చట్టం కింద కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. కొణిజర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక తన తాతయ్య, నాయనమ్మలతో కలిసి ప్రార్థనా మందిరానికి వెళ్లింది. ప్రార్థనలు ముగిసిన అనంతరం ఒంటరిగా ఇంటి వైపు బయల్దేరిన బాలికను మార్గమధ్యంలో ఒక బాలుడు అడ్డగించాడు. “నీ తమ్ముడు కిందపడిపోయాడు, గాయపడ్డాడు, వెంటనే రా” అంటూ మోసపూరితంగా నమ్మబలికాడు. అమాయకంగా నమ్మిన బాలిక అతనితో వెళ్లింది. ఆ బాలుడు ఆమెను తన స్నేహితుడైన 18 ఏళ్ల యువకుడి ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ మరో మైనర్ బాలుడు సిద్ధంగా ఉన్నాడు. ముగ్గురు కలిసి బాలికను అదుపులోకి తీసుకుని, చేతులు వెనక్కి విరిచి అత్యంత పాశవికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ దారుణ చర్యలో బాలిక తీవ్ర గాయాలతో మానసికంగా కుంగిపోయింది. ఘటన జరిగిన ఆ రాత్రి భయంతో ఎవరికీ చెప్పని బాలిక, మరుసటి రోజు నొప్పులు భరించలేక నాయనమ్మకు జరిగిన విషయం వివరించింది. ఆమె మాటలు విన్న పెద్దవారు షాక్‌కి గురయ్యారు. తల్లిదండ్రులు హైదరాబాద్ నుంచి రాగానే జరిగిన ఘోరాన్ని వివరించగా, వారు తక్షణమే కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ముగ్గురు నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు కాగా, మరొకడు 18 ఏళ్ల యువకుడని పోలీసులు వెల్లడించారు. నిందితులు గంజాయి మత్తులోనే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురు నిందితులు కూడా పరారీలో ఉన్నారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. గ్రామస్తులు, మహిళా సంఘాలు నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. గంజాయి, మత్తు పదార్థాల వాడకం యువతలో విపరీతంగా పెరుగుతుండటంతోనే ఇటువంటి ఘోరాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేవలం ఈ కేసులోనే కాదు, గ్రామాల్లో మత్తు పదార్థాల ముఠాలపై కూడా దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై కఠిన శిక్షలు అమలుచేయకపోతే ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతాయని ప్రజాభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రార్థనా మందిరం నుంచి తిరిగి వస్తూ మానవ రాక్షసుల బారిన పడిన ఈ అమాయక బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# గిరిజన రైతు శ్రీరాములుకు జాతీయ ఎస్టీ కమీషన్ పిలుపు



**దమ్మపేట, మహా :** ఆఫ్ టైప్ పామాయిల్ మొక్కలతో నష్టపోయిన పామాయిల్ రైతులకు ప్రభుత్వం నుండి ,ఆయిల్ ఫెడ్ నుండి నష్టపరిహారాన్ని అందించాలని మండలానికి చెందిన గిరిజన రైతు కారం శ్రీరాములు మార్చి 18 న రాష్ట్ర ఎస్టీ కమీషన్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. అట్టి విషయం పై ఈ నెల 7 వ తేదీన ఎస్టీ కమీషన్ ఎదుట హాజరు కావాలని నోటీసులు అందినట్లు కారం శ్రీరాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కారం మాట్లాడుతూ ప్రభుత్వ పామాయిల్ నర్సరీలలో 2016 లో నాణ్యత లేని మొక్కలను సరఫరా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఇప్పటికీ కూడా పామాయిల్ ఫ్యాక్టరీ లలో జరుగుతున్న అక్రమాలపై పరిశీలన చేయాలని కోరారు. నకిలీ యఫ్ కార్డు తో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ,దానిపై కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆప్ టైపు మొక్కలు వేసి నష్టపోయిన పామాయిల్ రైతులకు నష్టపరిహారం చెల్లించే వరకు దశల వారీగా పోరాడతామని తెలిపారు.

## హంతకులను వెనకేసుకొస్తున్న డిప్యూటీ సీఎం



**ముదిగొండ మహా:** సిపిఐ(ఎం) రాష్ట్ర నేత సీనియర్ నాయకులు,పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్,ప్రజా నేత సామినేని రామారావును హత్య చేసిన హంతకులను రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెనకేసుకొస్తున్నారని సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు బండి రమేష్ విమర్శించారు. చింతకాని మండలం పాతర్లపాడు సిపిఐ(ఎం) నాయకులు,మాజీ గ్రామ సర్పంచ్ సామినేని రామారావును హత్య చేసిన హంతకులను గుర్తించి పోలీసులు అరెస్టు చేయటంలో నిర్లక్ష్యధోరణి విడనాడాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ముదిగొండలో కార్యకర్తలు ఎర్రజెండాలతో బుధవారం భారీ సంఖ్యలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బండి రమేష్ మాట్లాడారు. హత్య జరిగిన తీరును చూస్తే కాంగ్రెస్ పార్టీ గుండాలే చేశారని,ఘటన స్థలాన్ని పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. రామారావు సతీమణి స్వరాజ్యం తన భర్తను చంపిన హంతకుల పేర్లను లిఖితపూర్వకంగా రాసి ఇచ్చిన పోలీసులు అరెస్ట్ చెయ్యకపోవటానికి కారణమేమిటిని ఆయన ప్రశ్నించారు. రామారావును హత్య కేసులో దోషులను అరెస్టు చేయకుండా బాధిత కుటుంబాన్ని వేధించడం సమంజసం కాదన్నారు. రామారావు హత్య చేసిన హంతకులను అరెస్టు చెయ్యనియెడల పోలీస్ స్టేషన్లను,కమిషన్ రేట్ ను ముట్టడిస్తామని బండి రమేష్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముదిగొండ మండలంలో సిపిఐ(ఎం) పురోభివృద్ధిని చూసి ఓర్వలేక పార్టీ నేతలను హతమార్చారన్నారు. మధిర నియోజకవర్గంలో భట్టి విక్రమార్క ప్రభుత్వంలో ప్రధాన పదవి బాధ్యతలలో ఉన్నప్పుడే సిపిఐ(ఎం) నేతలు హత్యలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## గిరిజన ఉద్యమ కెరటం “ధర్మ”



**భద్రాద్రి బ్యూరో, మహా:** గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం గుగులోత్ ధర్మ నిర్వహించిన ఉద్యమాలు నేటితరానికి ఆదర్శమని ఆయనలేని లోటు తీర్చలేనిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు, గిరిజన నేత గుగులోత్ ధర్మ ద్వితీయ వర్ధంతి సందర్బంగా సుజాతనగర్ మండలంలోని మంగపేట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ధర్మ విగ్రహావిష్కరణ, సంతాపసభలో అయన పాల్గొని మాట్లాడారు. గుగులోత్ ధర్మ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమాలకు దిక్సూచిలాంటివారని ఎన్నో ప్రజా రైతు గిరిజనోద్యమాలకు నాయకత్వం వహించారని ప్రజలకు ఒక్కతాటిపైకి తెచ్చి ప్రజా ఉద్యమాలు నిర్మించడం ద్వారా సమస్యల పరిష్కరం కోసం నిరంతరం శ్రమించాడని కొనియాడారు. అనంతరం విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మండల నాయకులు భూక్యా దస్రు, కుమారి హన్మంతరావు, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# తుల్జా భవాని ఆలయానికి నిధులు ఇవ్వండి



**కొత్తగూడెం రూరల్, మహా:** తుల్జా భవాని జాతర ఏర్పాటుకు స్థలం, నిధులు కేటాయించాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ ఛైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్, వైస్ ఛైర్మన్ బానోత్ వీరు నాయక్ తో పాటు తదితరులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బంజారా సంఘాల జేఏసీ ఛైర్మన్ డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బంజారాల ఆరాధ్య దైవాలకు సంబంధించి ఎటువంటి ఆలయాలు, జాతర స్థలాలు లేవని, దీనివల్ల ప్రతీ యేటా జాతరలు నిర్వహించేందుకు బంజారా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బంజారాలు కీలకపాత్ర పోషించారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 4 లక్షలకు పైగా బంజారా జనాభా ఉన్నారని పేర్కొన్నారు. గతంలో జిల్లా కేంద్రంలోని రేగళ్ల ప్రాంతంలో కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించినప్పటికీ అనివార్య కారణాల వల్ల ఆలయ నిర్మాణం జరగలేదని తెలిపారు. సంత్ శ్రీశ్రీశ్రీ సేవా లాల్ మహారాజ్, శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని ఆలయ నిర్మాణంతోపాటు జాతర నిర్వహణ కోసం అవసరమైన స్థలాన్ని అన్ని అనుమతులతో ప్రభుత్వం కేటాయించే విధంగా కృషి చేయడంతోపాటు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి త్వరితగతిన అన్ని అనుమతులతో స్థలం కేటాయించడంతోపాటు జాతర నిర్వహణకు అవసరమైన నిధులు, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జేఏసీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌ను కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బంజారాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను విన్నవించారు. శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని జాతర ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగదంబసేన వ్యవస్థాపక అధ్యక్షులు తేజావత్ రాములు, సాధుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నూనావత్ శంకర్, బిచ్చు సాధు, వస్రాం సాధు, బంజారా భవన్ పాల్వంచ కమిటీ నాయకులు భూక్య చందు, బానోత్ రాము, జిల్లా జేఏసీ నాయకులు ధరావత్ కాన్షీరాం, బానోత్ రమేష్, డాక్టర్ వెంకట్, జాటోత్ భరత్, టిఎస్‌టిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షులు బి.మోహన్, సపావత్ బాలకృష్ణ, జర్పుల బిక్కులాల్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాళోత్ శివ నాయక్, ధరావత్ కృష్ణ, ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ కేశవ్ నాయక్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గుగులోత్ మోహన్ నాయక్, చంద్రుగొండ మండల అధ్యక్షులు భూక్య రాందాస్ రాథోడ్, జిల్లా నాయకులు బానోత్ చందర్ నాయక్, ఏజెన్సీ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బానోత్ లాల్‌సింగ్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోత్ భద్రు నాయక్, భారతీయ గోర్‌బంజారా ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోడ గణేష్, గుగులోత్ కోటి, బానోత్ రాము, జర్నలిస్టు సంఘాల నాయకులు బానోత్ నాగేశ్వరరావు, బానోత్ రమేష్, బానోత్ రాందాస్, ధరావత్ వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు మూడ్ జయరాం నాయక్, నాయకులు మాళోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు వైడెనింగ్ పనులు పరిశీలించిన కాంగ్రెస్ నేతలు..



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుండి బాంబే కాలనీ వరకు రూ.5 కోట్ల 34 లక్షల వ్యయంతో జరుగుతున్న రోడ్డు వైడెనింగ్, సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులను మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కూనవరం పీవీ కాలనీ ప్రజల రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులను పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ చూపి మంజూరు చేయించారని నాయకులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పనులకు నిధులు మంజూరు కాగా.. పాలకులు కమిషన్లకు కక్కుర్తి పడి పనులను పూర్తి చేయలేకపోవడంతో ఇంతకాలం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడినట్లు, అనేక ప్రమాదాలు సంభవించిన విషయాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, కాటబోయిన నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, గాండ్ల సురేష్, చింతల కృష్ణ, మానస, స్వరూప తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 26 లక్షల గంజాయి స్వాధీనం

**భద్రాద్రి బ్యూరో, మహా:** ఒరిస్సా నుంచి గంజాయి కేరళకు కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని బుధవారం ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై శ్రీహరి రావు సిబ్బందితో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం కూనవరం క్రాస్ రోడ్ వద్ద పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవ్వాస్ ఖాసీం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా గంజాయిని పట్టుకున్నట్లు ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ గణేష్ తెలిపారు. కారు ఇంజన్ లో తనిఖీలు నిర్వహించగా గంజాయి పాకెట్లు కనిపించాయని లభించిన గంజాయి పాకెట్లను తూకం వేయగా 51.9 నైన్ కేజీల గంజాయిగా ఉందన్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 26 లక్షలుగా ఉంటుందని పేర్కొన్నారు. గంజాయితో పాటు కారు ఒక బైకును కూడా స్వాధీనం చేసుకున్నట్లుగా చెప్పారు. ఈ కేసులో కేరళకు చెందినటువంటి జకారియా పర్యాల్, నసిర పూర్తియా వేట్టల్ లను అరెస్ట్ చేసినట్లుగా తెలిపారు. ఈ కేసులో కందుల రవి సూర్యాపేటకు చెందిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. ఇతను పరారీలో ఉన్నట్లు తెలిపారు.



# విభజన గాయం!



**ఖమ్మం బ్యూరో, మహా:** తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులకు కీలక లేఖ రాశారు. భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఉన్న యాటపాక, కన్నాయిగూడెం, పిచుకల పాడు, పురుషోత్తపట్నం, గుండాల అనే ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ పరిపాలనా సమస్యలు, గిరిజనుల దైనందిన జీవన సవాళ్లు, శాంతిభద్రతల నిర్వహణలో ఇబ్బందులను ఆయన తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. ఈ డిమాండ్ కేవలం రాజకీయ అంశం కాదని, ఇది ప్రజల దశాబ్దాల ఆకాంక్ష మరియు పరిపాలనా ఆవశ్యకత అని తుమ్మల స్పష్టం చేశారులి

## ఆధ్యాత్మిక, పరిపాలనా వైరుధ్యం

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం తెలంగాణలో ఉన్నప్పటికీ, దానికి సంబంధించిన ఆలయ భూములు, ఆస్తులు ఆంధ్రప్రదేశ్‌లోని ఈ ఐదు గ్రామాల్లో ఉండటం తీవ్ర గందరగోళానికి దారితీసిందని తుమ్మల పేర్కొన్నారు. దీనివల్ల దేవస్థానం పరిపాలన, రికార్డులు, అభివృద్ధి ప్రణాళికలు నిలిచిపోతున్నాయని, ఇది "పరిపాలనా దౌర్భాగ్యం, ఆధ్యాత్మిక విభిన్నత" అని ఆయన వ్యాఖ్యానించారు. రామాలయ పట్టణం అభివృద్ధికి డంపింగ్ యార్డ్ వంటి ప్రాథమిక అవసరాలకు కూడా భూమి దొరకని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

## గిరిజనుల జీవన సవాళ్లు

ఈ ఐదు గ్రామాల ప్రజలు, ముఖ్యంగా గిరిజన సమాజం, తమ దైనందిన అవసరాలైన వైద్యం, విద్య, మార్కెటింగ్ కోసం సహజంగానే భద్రాచలం పట్టణంపై ఆధారపడుతున్నారని మంత్రి వివరించారు. రాష్ట్ర సరిహద్దులు అడ్డంకిగా మారడంతో, వీరు ప్రతి చిన్న అవసరానికి అంతర్రాష్ట్ర తనిఖీలు ఎదుర్కొంటున్నారని, వైద్య అత్యవసరాల్లో ఆలస్యం, విద్యా సంస్థలకు చేరడంలో సమస్యలు వంటి ఇబ్బందులతో తీవ్రంగా సతమతమవుతున్నారని ఆయన లేఖలో తెలిపారు.

## శాంతిభద్రతల సమన్వయ లోపం

భద్రాచలం పరిసర మండలాలు ఎల్‌డబ్ల్యూఈ (తీవ్రవాద ప్రభావిత ప్రాంతం)గా గుర్తించబడినందున, శాంతిభద్రతల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తుమ్మల స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల పోలీస్ శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల సమర్థవంతమైన శాంతిభద్రత నిర్వహణకు ఆటంకం కలుగుతోందని, ఈ కీలక ప్రాంతం మొత్తం ఒకే రాష్ట్ర పరిపాలన కింద ఉండటం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

## ప్రజల అవసరాలే కీలకం

రాష్ట్ర విభజన చట్టం యొక్క స్ఫూర్తిని గుర్తు చేస్తూ, ప్రజల అవసరాలు, భౌగోళిక అనుబంధం, చారిత్రక నేపథ్యం ఆధారంగా సరిహద్దులు నిర్ణయించాలనే నిబంధనను మంత్రి తుమ్మల ప్రస్తావించారు. భద్రాచలం పట్టణం తెలంగాణలో ఉండి, దానిని ఆనుకున్న గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం వల్ల ప్రజల దైనందిన జీవితానికి తీవ్ర అవరోధం ఏర్పడిందని, ఇది చట్టం ఆత్మకు విరుద్ధమని ఆయన లేఖలో వివరించారు.

## ప్రజా డిమాండ్‌కు న్యాయం చేయాలి

ఐదు గ్రామాల విలీనం డిమాండ్ కేవలం రాజకీయ ప్రయోజనం కోసం కాదని, గత పదేళ్లుగా ప్రజలు, గిరిజన సంఘాలు, గ్రామ సభలు పదేపదే కోరుకుంటున్న ప్రజా భావోద్వేగం, పరిపాలనా ఆవశ్యకత అని తుమ్మల స్పష్టం చేశారు. ఏపీలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, కేంద్రం, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ అంశాన్ని సానుకూలంగా చర్చించి, ప్రజల దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

**నేలకొండపల్లి,మహా:** మండల వ్యాప్తంగా కార్తిక పౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతోటి వైభవంగా బుధవారం జరుపుకున్నారు. మండల పరిధి నాచేపల్లి గ్రామాలలోని క్షీరా క్రామలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఏకువజామునే ఆలయాల వద్దకు చేరుకొని దైవ దీపారాధన చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి దైవానికి నైవేద్యం సమర్పించి ఆలయ అర్చకుల ఆశీస్సులు పొందారు. అదేవిధంగా కార్తిక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో నాగదేవతకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపుగా తరలివచ్చి రామలింగేశ్వర స్వామికి మొక్కులు చెల్లించిన సన్నివేశం చూపరులను ఆకట్టుకుంది. కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా భక్తుల భగవత్ నామస్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి.



# గీత కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం

**నేలకొండపల్లి, మహా:** కల్లుగీత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గీత కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం మండల మహాసభ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సంఘం పథకాన్ని వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం పొన్నం శివరాజ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడే లేడన్నాడు. సంఘం ఆధ్వర్యంలో గీత కార్మికుల హక్కుల సాధనకై జరిపిన పోరాటాల ఫలితంగా కొన్ని సమస్యలను పరిష్కరించుకోగలిగామని అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీల అమలుపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

# రంగరంగ వైభవంగా తెప్పోత్సవం





**కూసుమంచి,మహా:** కూసుమంచి మండలం, జీళ్ళచెరువు గ్రామంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో తెప్పోత్సవం కార్యక్రమం అంగరంగవైభవంగా జరిగింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తెప్పోత్సవంను ప్రారంభించారు. గ్రామం లోని ఊరచెరువులో కనుల విందుగా తెప్పోత్సవం జరగ్గా, వేలాది మంది కనులారా తిలకించారు. ప్రధానా ర్చకులు ముడుంబ శ్రీమన్నారాయణ చార్యులు, సాయిరామాచార్యులు, చిలక మర్రి స్వామినాథ్, స్వామి వారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగలక్ష్మి సత్యనారాయణ, ఈవో జగన్మోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి, పెంద్ర అంజయ్య, ఐతగాని నాగేశ్వరరావు, ఇంటూరి పుల్లయ్య, కొండా శ్రీనివాస్ రావు, మొక్క ఉపేందర్, శ్రీవెంకటేశ్వర స్వామి అంబాల వెంకటలక్ష్మి, లక్ష్మి నారాయణ, ఐ.రంగయ్య, ఎం. ఉపేందర్, ఐ. ప్రభాకర్, డైరెక్టర్లు బాలబోయిన శ్రీనివాస్, అంబాల నాగేశ్వరరావు, దంతాల శ్రీను, భక్తులు చెన్నా విజయ్, గోపి, అంజయ్య, రామారావు, లక్ష్మయ్య, మురళీ పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని



**నేలకొండపల్లి, మహా :** నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు "సాధించటంతో గ్రామస్తులు అభినందించారు. బుధవారం విద్యార్థిని ని ఘనంగా సన్మానించారు. నేలకొండపల్లి మండలం లోని రాయగూడెం గ్రామానికి చెందిన నెమలి వెంకటేశ్వర్లు- రేణుక దంపతుల కుమార్తె నెమలి జ్యోత్స్న ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు ను సాధించింది. వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించి.. కూతురు ను కష్టపడి చదివించారు. వారి కష్టం ను వృధా కాకుండా సీటు సాధించింది. 1 నుంచి 4 వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివారు. 5 నుంచి 10 వరకు బెస్ట్ అవెయిల్ బెల్ ద్వారా ఖమ్మం లోని సెంట్ జోసెప్స్ స్కూల్ చదివారు. పదో తరగతి లో 10 కు 10 మార్కులు సాధించి ప్రగతి సాధించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు . నంబూరి రామారావు, సూరేపల్లి రామారావు, సూరేపల్లి ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హెూరాహెూరీగా సాగుతున్న కబడ్డీ పోటీలు



**నేలకొండపల్లి, మహా:** కార్తీక పౌర్ణమి సందర్భంగా నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం లో జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు హెూరాహెూరీగా సాగుతున్నాయి. బుధవారం రెండో రోజున ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి ప్రారంభించారు. జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రబోయిన నర్సయ్య, అడపాల రామారావు, మాజీ ఉప సర్పంచ్ చిట్యాల రమేష్, ఇస్లావత్ బాలాజీ, యం. సుధీర్, పగిళ్ల ఆశోక్ , వెంకన్న, రెడ్డబోయిన నవీన్‌బీ ఎన్, బాబు పాల్గొన్నారు.

# పీఎస్ఆర్ ట్రస్టు పేదలకు అండగా నిలుస్తుంది



**నేలకొండపల్లి, మహా :** పీఎస్ఆర్ ట్రస్టు పేదలకు అండగా నిలుస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు అన్నారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన 32 కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ట్రస్టు అర్థిక సహాయం ను అందించారు.. బుధవారం మృతుల కుటుంబాలను పరామర్శించి... ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... మంత్రి శ్రీనివాసరెడ్డి ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఒక వైపు ప్రభుత్వం ద్వారా కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులు చేస్తూ..మరో పక్క ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.